సాక్షి
శ్రీకాకుళం

బుధవారం । 27 । డిసెంబర్ । 2023



పని నేర్పించి..

యువతులు స్వయం ఉపాధిపై దృష్టి పెడుతున్నారు. అందుకు తగ్గ శిక్షణ అందిస్తున్నారు.

- 8లో



రోడ్డు ప్రమాదంలో..

రంగోయి సమీపంలో పాల ట్రాక్టర్‌ను ఇన్నోవా ఢీకొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు.

- 8లో

నేడు నిధి ఆప్‌కే నిఖత్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఉద్యోగుల భవిష్య నిధి కార్యాలయంలో ఈఎస్ఐసీ సంయుక్తంగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు నిధి ఆప్ కే నిఖత్ ఔట్‌రీచ్ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా నోడల్ అధికారి షేక్ అహ్మద్‌భాషా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీకాకుళం నగరంలో బలగకు సమీపంలో భారత్ పెట్రోల్ బంక్ దగ్గర గల కార్యాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

మూలపేట పోర్టు సందర్శనలో స్వల్ప మార్పులు

నరసన్నపేట: సంతబొమ్మాళి మండలం మూలపేట వద్ద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పోర్టు సందర్శనలో స్వల్ప మార్పులు చేస్తున్నట్లు నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముందుగా ప్రకటించినట్లు బుధవారం కాకుండా గురువారం నాడు పోర్టు సందర్శన ఉంటుందని తెలిపారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు గమనించాలని సూచించారు. గురువారం పోర్టు సందర్శనకు పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డిలో పాటు పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ రానున్నారని, జిల్లాకు చెందిన మంత్రులు పాల్గొంటారని తెలిపారు. అలాగే పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పనితీరు కూడా అదే రోజు పరిశీలిస్తారని ఆయన తెలిపారు.

ఈ నెల 31తో ముగుస్తున్న బీఆర్‌ఏయూ రిజిస్ట్రార్ టెర్మ్



రాజేంద్ర ప్రసాద్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్ టెర్మ్ ఈ నెల 31తో ముగియనుంది. వర్సిటీ రిజిస్ట్రార్‌గా 2022 జనవరి 1న ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికి రెండేళ్లు పూర్తయ్యింది. నిబంధనల మేరకు రిజిస్ట్రార్‌ను ఏడాదికి నియమిస్తారు. ఆ తర్వాత ఉన్నత విద్యాశాఖ అనుమతులతో మరో ఏడాది రెన్యువల్ చేయవచ్చు. ప్రస్తుత రిజిస్ట్రార్ రెండు టెర్మ్‌లుగా రెండేళ్లు బాధ్యతలు నిర్వహించారు. ప్రసుత వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మూడేళ్ల టెర్మ్ జనవరి 18తో పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో రిజిస్ట్రార్ రిలీవ్ కావాలన్న నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు ఆయన నిర్ధారించారు.

గిన్నిస్ రికార్డులో లయశ్రీ నృత్యకారిణులు



గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పాల్గొన్న పరిమళ బృందం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం పట్టణానికి చెందిన లయశ్రీ నృత్య కళానికేతన్ శిష్య బృందం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం పొందిందని నృత్య నికేతన్ గురువు కె.పరిమళ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాదు గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఆదివారం భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో తనతో పాటుగా 25మంది శిష్య బృందం పాల్గొని ఏడు నిమిషాల పాటు లయబద్ధంగా కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి ఈ రికార్డు సాధించినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక పురోగతికి ప్రణాళికలు



మాట్లాడుతున్న మోహనరావు

నరసన్నపేట: గ్రామాల్లో ఆర్థిక పురోగతికి తగిన చర్యలు చేపట్టాలని దీనికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (ఐబీ) మోహనరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం గ్రామ సంఘాల ఓబీ సభ్యులతో పాటు ఏపీఎంలకు, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులకు విజన్ బిల్డింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కలలు కనాలని, వాటి సాధనకు వీలుగా కార్యాచరణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత, జీవన ప్రమాణాలు పెంపొందించడం, మూఢ నమ్మకాలను నిర్మూలించడం, బాల్య వివాహాలు అరికట్టడం, బ్యాంకు రుణాల ద్వారా మహిళలు మినీ పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మరో ఐకేపీ అధికారి వైకుంఠరావు, ఏరియా కోఆర్డినేటర్ కొండలరావు, లీగల్ ఏపీఎం బసవరాజు, పది మండలాలకు చెందిన ఏపీఎంలు, నరసన్నపేట ఏపీఎం హేమసుందర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం క్రికెట్ మ్యాచ్‌లో తలపడుతున్న జట్లు



క్రికెట్ ఆడి పోటీలను లాంఛనంగా ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

ఆట ఆరంభం

- అట్టహాసంగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభం
- పోటీలను ప్రారంభించిన కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్
- ఊరూవాడా క్రీడలతో సందడి

శ్రీకాకుళం న్యూకాలనీ/ టెక్కలి :

ఊరూవాడా హోరెత్తేలా ఆటల సంబరం మొదలైంది. జిల్లావ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా మెగా క్రీడా పర్వం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడా మైదానం వేదికగా జిల్లాలో ఆడుదాం ఆంధ్ర పోటీలను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారికంగా ప్రారంభించారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనాన్ని సమర్పించిన కలెక్టర్.. జాతీయ గీతాలాపన చేసి, క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఒలింపిక్ జ్యోతిని వెలిగించిన కలెక్టర్, బెలూన్లను నింగిలోకి విడిచిపెట్టారు. అనంతరం మైదానంలో క్రికెట్ ఆడి బ్యాటింగ్ చేసి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయాల పరిధిలోని క్రీడాకారుల బృందాలకు కలెక్టర్ చేతులమీదుగా స్పోర్ట్స్ కిట్‌లను అందజేశారు.



పాతపట్నం : బ్యాడ్మింటన్ క్రీడను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మట్టిలో మాణిక్యాలను వెలికి తీస్తాం

గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను గుర్తించి, వారిని జాతీయ అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ఆడుదాం ఆంధ్ర పోటీల ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని, ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడమే సీఎం జగన్ లక్ష్యమని పేర్కొన్నారు. 47 రోజులపాటు జరిగే పోటీల్లో రాష్ట్రస్థాయిలో శ్రీకాకుళం ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లావ్యాప్తంగా వివిధ క్రీడాంశాలలో 11,500 జట్లు నమోదు చేసుకున్నాయని గుర్తుచేశారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించిన రాష్ట్ర బ్రాండ్ అంబాసిడర్ ఆటగాళ్లయిన తోటాడ శ్రీనివాస్ (బేస్‌బాల్), కూటికుప్పల వరలక్ష్మి (సాఫ్ట్‌బాల్), బి.ప్రసన్న రామచంద్రరావు(అథ్లెటిక్స్)లను ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, సెట్ శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి ఎం.వాసుదేవరావు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, ఎస్వైకె అధికారి కె.వెంకట్ ఉజ్వల్, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, క్రీడాసంఘాలు, పీఈటీ సంఘ ప్రతినిదులు, పీడీలు, సచివాలయల అడ్మిన్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నజరానా ప్రకటన..

ఆడుదాం ఆంధ్ర పోటీలను మరింతగా ఉత్తేజపరిచేలా కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు క్రీడాకారులకు నజరానా ప్రకటించారు. శ్రీకాకుళం నగర పరిధిలోని సచివాలయాల పరిధిలో 70 మ్యాచ్‌లు జరగనుండగా.. వీటిల్లో అత్యధిక పరుగులు, అత్యధిక వికెట్లు సాధించిన ఆటగాళ్లకు చెరో రూ.5వేలు చొప్పున నగదు అందజేస్తానని ప్రకటించారు.



మబగాంలో వాలీబాల్ సర్వీస్ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



కంచిలిలో క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ

క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహం



గ్రామస్థాయిలో మాలాంటి మరుగున పడిన క్రీడాకారులకు ఆడుదాం–ఆంధ్రా ఆటల పోటీలు ఎంతో ప్రోత్సాహకరంగా ఉన్నాయి. మా సచివాలయం పరిధిలో వాలీబాల్ క్రీడలో పాల్గొన్నాను. గతంలో వాలీబాల్ ఆటలు ఆడేవాడిని.సరైన ప్రోత్సాహం లేకపోవడంతో, క్రీడపై ఆసక్తి తగ్గింది. ఆడుదాం–ఆంధ్రాతో ఆసక్తి రెట్టింపైంది.

– కె.అశోక్‌కుమార్, టెక్కలి

క్రీడలతో మానసిక ఆరోగ్యం



ఆడుదాం–ఆంధ్రా ఎంతో మంచి కార్యక్రమం. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను గుర్తించడం, మానసిక ఆరోగ్యాన్ని కలిగించడం కోసం ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తోంది. ఈ క్రీడలతో ఎంతో మంది క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించగలరు.

– బి.నారాయణరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు, టెక్కలి.



టెక్కలి మండలం పెద్దసాన గ్రామంలో ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో భాగంగా కబడ్డీ పోటీల్లో ఉడుంపట్టు పడుతున్న వృద్ధుడు కృష్ణారావు



కాశీబుగ్గలో పోటీలు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు, తదితరులు



ఎచ్చెర్ల: బ్యాడ్మింటన్ ఆడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు తీపికబురు

- 238 మందిని రెగ్యులర్ చేసేందుకు రంగం సిద్ధం



కాంట్రాక్ట్ ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అరసవల్లి: ఏళ్ల తరబడి వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న వివిధ క్యాడర్ల ఉద్యోగుల జీవితాల్లో శాశ్వత వెలుగులు నింపేలా వైఎస్ జగన్ సర్కారు చర్యలు తీసుకుంటోంది. ఆయా శాఖాధికారులు అర్హులను రోస్టర్ ప్రకారం రెగ్యులర్ చేసేలా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం జిల్లాలో మొత్తం 238 మంది ఉద్యోగుల ధ్రువీకరణ పత్రాల స్వీకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో హెల్త్ అసిస్టెంట్లు 210 మంది, ల్యాబ్ టెక్నీషియన్లు 10, ఫార్మాసిస్టులు 8 మంది, ఏఎన్ఎంలు 4, స్టాఫ్ నర్సులు 6 మంది మొత్తంగా 238 మందికి రెగ్యులర్ ఉద్యోగులయ్యే అవకాశం లభించింది. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం అద్భుతమైన వరాన్ని ప్రసాదించిందని, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న మొత్తం 238 మందిని రెగ్యులర్ ఉద్యోగులుగా త్వరలోనే పరిగణించేలా ఉత్తర్వులు రానున్నాయన్నారు. అయితే ఇందులో ధ్రువీ కరణ పత్రాలన్నీ డైరక్టరేట్ కార్యాలయానికి పంపించాల్సి ఉందని, తదుపరి అక్కడే పత్రాలన్నీ అప్‌లోడ్ అవుతాయని, తర్వాత ఉన్నతాధికారుల నిర్ణయాల ప్రకారం రెగ్యులర్ చేసే ప్రక్రియ మొదలవుతుందని వివరించారు.

రెగ్యులర్ చేసే క్రమంలో ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దని, ప్రలోభాలకు లొంగవద్దని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నియామకాల నుంచి పదోన్నతులు, రెగ్యులర్ చేసే ప్రతి పనిని అత్యంత పారదర్శకంగా చేస్తోందని గుర్తుచేశారు.

53 రోజుల్లో రూ.55.75 లక్షలు



హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి హుండీల కానుకల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. మొత్తం 53 రోజుల్లో రూ.55,75,235 మేరకు ఆదాయం లభించిందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. నగదు రూపంలో రూ.53,77,616, చిల్లర రూపంలో రూ.1,97,619 వరకు లభించగా, బంగారం 15 గ్రాముల 5 మిల్లీ గ్రాములు, వెండి 2 కిలోల 200 గ్రాముల వస్తువులు కానుకల రూపంలో లభించాయి. విజయనగరం జిల్లా రామతీర్థం ఆలయ ఈఓ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపు ప్రక్రియలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కళింగ సీమ కంఠాభరణం

- నేడు పుల్లెల శ్యామసుందరం 121వ జయంతి



ఇచ్ఛాపురం రూరల్: కళింగ సీమ నుంచి స్వాతంత్ర్య గర్జన చేసిన తొలివీరుల్లో ఆయన అగ్రగణ్యుడు. ఇచ్ఛాపురం నుంచి దేశభక్తిని నలుదిశలా చాటిన వారిలో ఆయన కీలకమైన వారు. బ్రిటిష్ పాలకుల హెచ్చరికలను తృణప్రాయంగా తుంచేసిన ధీశాలి. జిల్లా చరిత్రలో సగర్వంగా చెప్పుకునే పుల్లెల శ్యామసుందరం జయంతి నేడు.

1903 డిసెంబర్ 27న ఇచ్ఛాపురంలో పుల్లెల వెంకటరామయ్య పంతులు, కామేశ్వరమ్మ దంపతులకు ద్వితీయ సంతానంగా జన్మించిన శ్యామసుందరరావు స్థానిక సురంగి రాజా పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. వారిది సంపన్న కుటుంబం కావడంతో బరంపురం, విజయనగరం, కళాశాలల్లో చదివారు. ఉన్నత విద్య కోసం మద్రాస్ చేరుకున్న శ్యామసుందరరావు ఆలోచనలు స్వాతంత్ర్యోద్యమం వైపు నడిచాయి. మహాత్మా గాంధీ పిలుపును అందుకుని 1921వ సంవత్సరంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన సహాయ నిరాకరణోద్యమం శ్యామసుందరరావును ఉద్యమ బాటవైపు నడిపించింది. 'దున్నే వాడిది భూమి' నినాదంతో రైతు ఉద్యమానికి కళింగ సీమ నుంచి నాయకత్వం వహించిన పుల్లెల రాకతో ఇక్కడ స్వాతంత్ర్య పోరాటం కొత్త పుంతలు తొక్కింది. ఉద్యమమే ఊపిరిగా, వెన్ను చూపని ధీరునిగా తెల్లదొరలను గడగడలాడించిన శ్యామసుందరరావు ధాటికి తల్లడిల్లిన బ్రిటిష్ పాలకులు 1922 ఫిబ్రవరి 8వ తేదీన ఆయన్ని నిర్బంధించి బరంపురం, ఆ తర్వాత కడలూరు జైళ్లకు తరలించారు. సరిగ్గా ఏడు నెలల ఏడు రోజులు జైలు జీవితం గడిపిన శ్యామసుందరరావు 1922 సెప్టెంబర్ 14న విడుదలై రెట్టించిన ఉత్సాహంతో ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఆచార్య ఎన్‌జీ రంగా, శీలభద్రయాజీలతో కలిసి పలాసలో అఖిల భారత రైతు సదస్సు నిర్వహించారు. జమీందారు వ్యవస్థకు వ్యతిరేకంగా గుడారి రాజపురంలో జరిగిన పోరాటంలో కీలక పాత్ర పోషించారు. 1930 ఉప్పు సత్యాగ్రహోద్యమంలో భాగంగా నౌపడ ఉప్పు గల్లీలపై దాడి చేసిన పుల్లెలకు రెండో సారి ఏడాది పాటు జైలు శిక్ష విధించారు. అదే సంవత్సరం బ్రిటిష్ వ్యతిరేక కార్యకలాపాలకు నాయకత్వం వహించిన ఆయనను 1932 జనవరి 16న నిర్బంధించి కఠిన కారాగారానికి పంపించారు. ఆరు నెలలు కఠిన కారాగార శిక్ష అనుభవించిన శ్యామసుందరరావుకు వంద రూపాయలు జరిమానా విధించారు.

రాజకీయ రంగంలోనూ..

1933 నుంచి ఇచ్ఛాపురం సర్పంచ్‌గా వ్యవహరించిన పుల్లెల 1935 నుంచి జాతీయ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, అవిభక్త గంజాం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా, అనంతరం అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. 1937 ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఆనాటి మంత్రి సర్ ఏపీ పాత్రోను ఓడించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1940లో కిసాన్ సభకు అధ్యక్షునిగా వ్యవహరించిన ఆయన శ్రీకాకుళం జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరించారు. నిరంతర పోరాటాలతో తెల్లదొరలకు పక్కలో బల్లెంలా మారిన శ్యామసుందరరావును 1940లో గృహంలో నిర్బంధించారు. గృహ నిర్బంధంలో ఉండగానే 1940 జూన్ 16వ తేదీన అశువులు బాశా రు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ కార్యాలయానికి సమీపంలో పాత హైవేపై, శ్రీకాకుళం కొత్త బ్రిడ్జి ప్రాంతంలో పుల్లెల శ్యామసుందరరావు విగ్రహాలను నెలకొల్పేందుకు గత ఏడాది అక్టోబర్‌లో ప్రత్యేక కమిటీ పేరిట ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చకపోవం విచారకరమని ఆయన అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తీరంలో విషాదం



సముద్రంలో గాలిస్తున్న స్థానిక మత్స్యకారులు

- విహార యాత్రకు వచ్చి గల్లంతైన విద్యార్థులు
- ఇద్దరిని రక్షించిన మత్స్యకారులు
- లభించని ఒకరి ఆచూకీ
- మందస మండలం సిగలపుట్టుగ బీచ్‌లో ఘటన



సముద్రంలో గల్లంతైన విద్యార్థి జయరాం

మందస: సరదాగా గడుపుదామని సముద్ర తీరానికి వచ్చిన విద్యార్థులకు విషాదం ఎదురైంది. ముగ్గురు విద్యార్థులు సముద్రంలో గల్లంతై పోగా.. ఇద్దరు దొరికారు. మరొకరి ఆచూకీ లభించలేదు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన భేతాళపురం పంచాయతీ, రట్టి తీరంలోని సిగలపుట్టుగలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం మండలం బెల్లుపడలోని ఓ ట్యూషన్ సెంటర్ నుంచి సుమారు 38పైగా విద్యార్థులు సిగలపుట్టుగ బీచ్‌కు మంగళవారం పిక్నిక్ చేసుకుందామని వచ్చారు. తీరంలో ఆనందంగా గడిపిన విద్యార్థులు సముద్ర స్నానానికి దిగారు. పెద్ద అల రావడంతో పలువురు విద్యార్థులు కొట్టుకుపోయారు. కొంతమంది ఒడ్డుకు రాగా, ఆశి జయరాం, ఎస్.మేఘన, బి.చందు అనే విద్యార్థులు గల్లంతయ్యారు. స్థానిక మత్స్యకారులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. తీరంలోని గ్రామాల్లో గల మత్స్యకారులకు కూడా ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో వారంతా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ లోగా మెరైన్ సీఐ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మత్స్యకారులు చందు, మేఘనను కష్టపడి ఒడ్డుకు తీసుకురాగలిగారు. వీరు అప్పటికే అపస్మారక స్థితికి చేరుకోవడంతో హుటాహుటిన హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు పంపించారు. ఆశి జయరాం ఆచూకీ మాత్రం లభించలేదు. ప్రమాదంపై విద్యార్థుల కుటుంబాలకు సమాచారం అందజేశారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు ఆపారు.

ఒక్కడే కుమారుడు



మేఘన



డి.చందు

ఇచ్ఛాపురం: గల్లంతైన ఆశి జయరాం తల్లిదండ్రులు హరికృష్ణ, నాగమ్మ దంపతులకు చిన్న కుమారుడు. వీరికి ముగ్గురు సంతానం కాగా ఇద్దరు ఆడ పిల్లల తర్వాత జయరాం జన్మించాడు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జయరాం తోటి విద్యార్థులతో సరదాగా ఉండేవాడు. జయరాం సముద్రంలో గల్లంతైపోయాడన్న వార్త తెలిసి కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. ఆచూకీ లభించకపోవడంతో తమ కుమారుడు ఎలాగైనా బతికి బయటపడాలని దేవుళ్లకు మొక్కుకున్నారు.

'విలువలతో కూడిన విద్యను అందించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. జిల్లా భాషోపాధ్యాయ సంస్థ జిల్లా శాఖ క్యాలెండర్‌ను మంగళవారం ఆయన తన చాంబర్‌లో ఆవిష్కరించారు. పిల్లలకు సంక్షేమ పథకాలు సకాలంలో చేరేలా చూడాలని, మెరుగైన ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా శాఖ అధ్యక్షుడు పిసిని వసంతరావు, సహాధ్యక్షులు కుప్పన్నగారి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కూన రంగనాయకులు, శ్రీనివాసరావు, జనార్దనరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జనవరి 16 వరకు వర్సిటీకి సెలవులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి క్రిస్మస్, సంక్రాంతి సెలవులు ప్రకటించారు. క్లాస్‌వర్క్‌కు ఈ నెల 24 నుంచి సెలవులు ఇచ్చారు. జనవరి 16వరకు సెలవులు కొనసాగుతాయి. 17న క్లాస్‌వర్క్ ప్రారంభం కానుంది. పబ్లిక్ సెలవు దినాల్లో మినహా పాలనా వ్యవహారాలు, కార్యాలయాల నిర్వహణ కొనసాగుతుందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

నేటి నుంచి అంతర పాలిటెక్నిక్ కాలేజీల స్పోర్ట్స్ మీట్

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నుంచి ఈ నెల 29వ తేదీ వరకు 26వ అంతర ప్రాంతీయ పాలిటెక్నిక్ క్రీడలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బట్టు జానకిరామయ్య మంగళవారం తెలిపారు. ఈ పోటీలను సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించనున్నారని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పది పాలిటెక్నిక్‌ల నుంచి క్రీడాకారులు హాజరు కానున్నారని తెలిపారు. క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు.

డిపార్ట్‌మెంట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఏపీపీఎస్సీ నిర్వహించే కంప్యూటర్ ఆధారిత డిపార్ట్‌మెంటల్ పరీక్షలు, పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల పరీక్షలను సమర్థంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు అన్నారు. ఆయన మంగళవారం స్థానిక కలెక్టరు కార్యాలయంలోని డిఆర్వో చాంబర్‌లో ఏపీపీఎస్సీ అధికారులు, పోలీస్, విద్యుత్, వైద్య, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులతో సమీక్షించారు. ఈనెల 27 నుంచి జనవరి 3వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం 2 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎచ్చెర్ల మండలంలో శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీలో సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నిర్దేశిత పరీక్ష సమయానికి అర్ధగంట ముందుగా గేట్లు మూసివేస్తారని తెలిపారు.

28న రాష్ట్ర అంతర్‌జిల్లాల టెన్నీ కాయిట్ పోటీలు

పాతపట్నం: ఆంధ్రప్రదేశ్ అంతరజిల్లాల స్త్రీ, పురుషుల టెన్నికాయిట్ పోటీలు 28న నిర్వహించనున్నామని జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ అధ్యక్షుడు యెన్ని శేఖర బాబు మంగళవారం తెలిపారు. ఈ పోటీలు పాతపట్నం మండల కేంద్రంలోని మినీస్టేడియం క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 28 నుంచి 30తేదీ వరకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

బంతి పూలసాగుతో అధిక లాభాలు

కోటబొమ్మాళి: పూర్ణిమ ఎల్లోరకం బంతి పూల సాగుతో అధిక లాభాలు ఆర్జించవచ్చని ఆమదాలవలస కేవీకే హార్టీకల్చరర్ శాస్త్రవేత్త డాక్టర్ వి. హరికుమార్ అన్నారు. కోటబొమ్మాళి మండలం చిన్నసాన గ్రామానికి చెందిన రైతు మేడిబోయిన నారాయణరావుకు చెందిన పూర్ణిమ ఎల్లోరకం బంతిపూల సాగును ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సాగు విధానాలు, దిగుబడి, పూలకోత అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ విస్తరణాధికారి జి.సంధ్య, ఉద్యానవన శాఖాధికారి కె.సునీత పాల్గొన్నారు.

పని నేర్పించి.. కొలువు చూపించి

- స్కిల్ కాలేజీలో యువతులకు సూయింగ్ మిషన్ ఆపరేటర్ శిక్షణ
- 90 రోజుల శిక్షణ అనంతరం ప్లేస్‌మెంట్
- పది బ్యాచుల్లో 300 మందికి ఉపాధి కల్పన



టైలరింగ్ సాధన చేస్తున్న యువతులు

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతులకు ఉపాధి లక్ష్యంగా సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ సంస్థ (సీడాప్), దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన సహకారంతో చక్కటి ప్రణాళికలు అమలు చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద యువతులకు ఉద్యోగ, ఉపాధి కోర్సుల్లో శిక్షణ అందిస్తూ కొలువు కూడా చూపిస్తున్నారు. ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో ఈ శిక్షణలు నిర్వహిస్తున్నారు. 2021లో ఈ శిక్షణ ప్రారంభం కాగా, శిక్షణ కాలం 90 రోజులు, ఇప్పటికి 10 బ్యాచ్‌లు రిలీవ్ అయ్యాయి. ఒక బ్యాచ్‌లో 30 మందికి శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటివరకు 300 మందికి శిక్షణ ఇచ్చి, ప్లేస్‌మెంట్‌లు కల్పించారు. నెల్లూరుకు చెందిన మోహన్ వస్త్రపరిశ్రమలో 150 మందికి, విజయవాడలోని లాయిల్ టెక్స్‌టైల్స్ పరిశ్రమలో 150 మందికి ఉపాధి కల్పించారు. వస్త్ర పరిశ్రమల్లో రూ.10వేల నుంచి రూ. 15వేల మధ్య వేతనం ఇస్తున్నారు. వసతి, భోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఈ శిక్షణ సద్వినియోగం చేసుకుంటున్నారు.



వస్త్రపరిశ్రమలో పనిచేస్తున్న మహిళలు



ఎచ్చెర్లలోని స్కిల్ కాలేజ్

సూయింగ్ మిషన్ ఆపరేటర్‌గా..

ప్రధానంగా 90 రోజుల సూయింగ్ మిషన్ ఆపరేటర్‌గా వస్త్ర పరిశ్రమలు అవసరాలకు తగ్గ శిక్షణ ఇస్తున్నారు. టైలరింగ్, కటింగ్, అన్ని రకాలు వస్త్రాలు కుట్టటం, ఇతర పరిశ్రమల అవసరాలపై శిక్షణతోపాటు, కమ్యూనికేషన్ స్కిల్, పలు సాఫ్ట్‌వేర్ యాప్‌ల వినియోగం, తెలుగు, ఇంగ్లిష్ టైపింగ్ వంటి వాటిపైనా శిక్షణ అందజేస్తున్నారు. వస్త్ర పరిశ్రమల్లో ఉన్నత చదువులు ఉన్న వారు మేనేజర్, సూపర్ వైజర్ వంటి పోస్టులకు ఎదిగే అవకాశం కూడా ఉంది. ఇందుకు సంబంధించిన విషయ పరిజ్ఞానంపైనా శిక్షణ అందిస్తున్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ చదివిన యువతులు సైతం ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ప్రస్తుతం 11వ బ్యాచ్ ప్రారంభంపై దృష్టి పెట్టారు.

పూర్తిస్థాయిలో నేర్చుకున్నా



నేను డిగ్రీ చదువుకున్నాను. స్వయం ఉపాధి లక్ష్యంగా సూయింగ్ మిషన్ ఆపరేటర్ శిక్షణ కోసం స్కిల్ కాలేజీలో చేరాను. వస్త్ర పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ తీసుకున్నాను. అనంతరం వస్త్ర పరిశ్రమలో కొన్ని నెలలు పనిచేశారు. వివాహం తర్వాత స్వయం ఉపాధికి ప్రాధాన్యత ఇచ్చాను. అన్ని రకాలు వస్త్రాలు కుడుతూ స్వయం ఉపాధి పొందుతున్నాను.

– వమ్మరవల్లి పుష్పలత, గొల్ల వలస, పోలాకి మండలం

స్వయం ఉపాధి అవసరం



స్వయం ఉపాధి లక్ష్యంగా నేను సూయింగ్ మిషన్ ఆపరేటర్ శిక్షణలో చేరాను. ఇంటర్మీడియెట్ చదివిన నేను, శిక్షణ అనంతరం నెల్లూరు వస్త్ర పరిశ్రమలో చేరాను. ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్నాను. నా కుటుంబానికి ఆర్థికంగా సహకరిస్తున్నాను. వస్త్ర పరిశ్రమల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ పరిశ్రమ అవసరాలను అనుగుణంగా నైపుణ్యం సాధిస్తే మంచి వేతనం పొందవచ్చు.

– కర్రి లావణ్య, తిర్లంగి గ్రామం, టెక్కలి

పూర్తిస్థాయి శిక్షణ

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఉంటుంది. అన్ని రకాల వస్త్రాలు కుట్టడంతో పాటు పరిశ్రమల్లో ఇతర ఉద్యోగాలు అందిపుచ్చుకునేలా కంప్యూటర్ పరిజ్ఞానం, సాఫ్ట్‌వేర్ వినియోగం, ఎంఎస్ ఆఫీస్, టైపింగ్, స్పోకెన్ ఇంగ్లిష్ వంటివాటిపైనా శిక్షణ అందిస్తున్నాం. గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధికి ఈ శిక్షణ ఉపయోగపడుతుంది. 10 బ్యాచ్‌ల్లో 300 మంది శిక్షణ పూర్తి చేశారు. ప్రస్తుతం 11వ బ్యాచ్ ప్రారంభించాం.

– కె.ప్రభావతి, శిక్షకురాలు

కొనసాగుతున్న వైద్య శాఖ ఆడిట్

అరసవల్లి: జిల్లాలో ఉన్న పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇంతవరకు వచ్చిన నిధులు, ఖర్చుల లెక్క తేల్చేందుకు ఏజీ ఆడిట్ అధికారుల బృందం చర్యలు చేపట్టింది. ఈ నెల 18 నుంచి జిల్లాలో పలు పీహెచ్‌సీల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలైన నిధులతో పాటు పలు ప్రభుత్వాల పథకాల అమలు నిర్వహణకు వ్యయం తదితర అంశాలపై ఆడిట్ నిర్వహించారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయ సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వ ఆడిట్ అధికారుల బృందం సీనియర్ ఆడిట్ అధికారి డి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో సహాయ ఆడిట్ అధికారులు దినేష్, ఆశిష్ తదితరులు మంగళవారం పీహెచ్‌సీ వైద్యుల నుంచి పలు రికార్డులను తెప్పించుకుని లెక్కలను పరిశీలించారు.

జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద అత్యధికంగా నిధులు వస్తున్న క్రమంలో మందుల స్టోర్ రికార్డు నుంచి అన్ని రకాల బెనిఫిట్స్ రికార్డులను కూడా పరిశీలించనున్నారు. వాస్తవానికి జిల్లాలో వైద్యారోగ్య శాఖలో 2009 నుంచి ఆడిట్ ప్రక్రియ జరగలేదు. తాజాగా వచ్చిన ఈ ఆడిట్ బృందం అప్పటి నుంచి ఆడిట్‌ను నిర్వహించేందుకు మొత్తం 20 రోజుల పని దినాల్లో ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.



పీహెచ్‌సీ రికార్డులను పరిశీలిస్తున్న సీనియర్ ఆడిట్ ఆఫీసర్ మురళీకృష్ణ

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎంసీఏ, ఎంబీఏ, సైన్స్, ఆర్ట్స్ కోర్సుల్లో మిగులు సీట్లలో తక్షణ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. బుధవారంతో ఈ ప్రక్రియ ముగియనుంది. ఇప్పటి వరకు ఎంసీఏకు 12, ఎంబీఏకి 9 దరఖాస్తులు వచ్చాయి. బుధవారం దరఖాస్తులు స్వీకరించి ఖాళీ సీట్లు, ఐసెట్-2023 ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు పూర్తి చేస్తారు. ఎంబీఏలో 16, ఎంసీఏలో ఐదు సీట్లు ఖాళీలు ఉన్నాయి. ఎంసీఏలో సీట్లకు డిమాండ్ ఉండగా, సీట్లు పెంచే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. మరో పక్క 16 పీజీ ఆర్ట్స్, సైన్స్ కోర్సుల్లో తక్షణ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా, ఈ ప్రక్రియ 29 వరకు కొనసాగనుంది. 29 సాయంత్రం నాటికి సీట్లు ఖాళీలు, మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.



ఎంసీఏ విభాగంలో తక్షణ ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

అదుపు తప్పిన ట్రావెల్ బస్సు

ఇచ్ఛాపురం రూరల్: డబ్బై మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ట్రావెల్ బస్సు పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. వివరాల్లోకి వెళితే.. జార్ఖండ్ రాష్ట్రం దుమ్కా జిల్లా రామిలసూదన్ ప్రాంతానికి చెందిన 50 మంది కేరళ రాష్ట్రం కురుస్‌పల్లి ప్రాంతంలో వ్యవసాయ కూలీలుగా పనులు చేస్తున్నారు. సంక్రాంతి రానున్న నేపథ్యంలో ముందస్తుగా స్వగ్రామానికి వెళ్లేందుకు పిల్లా, పాపలతో కలసి సుమారు 70 మంది కూలీలు ఆదివారం ఉదయం కేరళ రాష్ట్రం కట్టప్పన్ బస్టాండ్ నుంచి ట్రావెల్ బస్సులో బయల్దేరారు. మంగళవారం మధ్యాహ్నం బస్సు లొద్దపుట్టి గ్రామ 16వ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న సమయంలో బస్సు ఒక్కసారిగా పక్కకు పూర్తిగా ఒరిగిపోయింది. దీంతో నిద్ర మత్తులో ఉన్న కూలీలు బస్సు లోయలో పడిపోయిందన్న ఆందోళనతో హాహాకారాలు చేశారు. దీంతో స్థానికులు వెంటనే స్పందించి బస్సులో ఉన్న కూలీలు, చిన్నారులను సురక్షితంగా రక్షించారు. చిన్నపాటి గాయాలతో బయటపడిన కూలీలకు ప్రథమ చికిత్సను అందజేశారు. విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ నర్తు నరేంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని కూలీలకు ధైర్యం చెప్పారు. రాత్రి గ్రామంలో భోజన వసతి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులను కోరారు. స్పందించిన గ్రామస్తులు మధ్యాహ్నం హోటల్ నుంచి భోజనాలు తెప్పించి క్షతగాత్రులకు అందజేశారు. డ్రైవర్ టీజాటిక్క పరారీలో ఉండగా, ఆయనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.రమేష్ తెలిపారు.



సంఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న పిరియా సాయిరాజు

తండ్రి, తమ్ముడే హంతకులు

ఎచ్చెర్ల: లావేరు మండలం కేశవరాయునిపాలేం గ్రామానికి చెందిన గుజ్జు పోలిరెడ్డి (28) మృతి మిస్టరీ వీడింది. ఈ నెల 23వ తేదీన కేశవరాయునిపాలేంలో ఆయన కల్లం వద్ద గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. జేఆర్‌పురం సీఐ ఆదాం, లావేరు ఎస్‌ఐ కోటీశ్వరరావులు తమ సిబ్బందితో కలిసి ఈ కేసులో ముద్దాయిలను గుర్తించారు. మంగళవారం జేఆర్‌పురం సీఐ ఆదాం, ఎస్‌ఐ కోటీశ్వరరావులు తమ సిబ్బందితో బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తులో మృతుని సొంత తమ్ముడు గుజ్జు శ్రీను, తండ్రి గుజ్జు ఎరకయ్యలను నిందితులుగా గుర్తించి రెవెన్యూ అధికారుల ద్వారా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని సీఐ ఆదాం విచారించగా.. పోలిరెడ్డి మద్యానికి బానిసై తమను ఇబ్బంది పెడుతున్నాడని, అతడిని ఎలాగైనా చంపాలని ఈ నెల 22న రాత్రి అతడికి మద్యం తాగించి కర్రతో కొట్టి చంపేశారని ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఏఎస్‌ఐలు కె.భుజింగరావు, హెచ్‌సీపి రామారావు, జి రామారావు, పీసీలు ధర్మ, వెంకటరమణ, భాస్కరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైదానంలో ఆక్రమణల తొలగింపు



కాలువలో మట్టిని తొలగించిన అధికారులు

సోంపేట: స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగించారు. సోంపేట ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని స్థానికులు ఆక్రమించి, మురుగు కాలువ కప్పి వేసి ఇటీవల రహదారి వేయడానికి సిద్ధమయ్యారు. దీంతో స్థానిక క్రీడాకారులు ఈ సమస్యను జెడ్పీటీసీ తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు దృష్టికి తీసుకెళ్లారు. వారు ఆర్డీఓ, జిల్లా విద్యాశాఖాధికారులకు సమస్య విన్నవించారు. ఇటీవల పలాసకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కూడా విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక రెవెన్యూ సిబ్బంది కప్పివేసిన కాలువలో మట్టిని మంగళవారం తొలగించి రహదారి నిర్మాణాన్ని అడ్డుకున్నారు. సీఎం స్పందించి సమస్యను పరిష్కరించడంతో జెడ్పీటీసీ తడక యశోద, సర్పంచ్ తడక జోగారావు, స్థానిక క్రీడాకారులు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

కాశీబుగ్గ: పలాస మండలం రంగోయి కూడలి జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఎదురుగా వెళ్తున్న పాల ట్రాక్టర్‌ను వెనుక నుంచి అతివేగంగా వచ్చినా ఇన్నోవా కారు బలంగా ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజిన్‌తోపాటు డొక్కు బోల్తా పడగా పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జుత్తు నరేష్ (45), శ్రీరాములు (50) పి.రాముడు (45)లకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హరిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం క్రేన్ సాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



రంగోయి వద్ద ప్రమాద స్థలం

'పథకాలు అందకపోతే సంప్రదించండి'

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కరుణ సమాజంలో రెడ్‌క్రాస్, అప్‌హోల్డ్ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం జరిగాయి. కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా 45మంది కుష్టు వ్యాధి గ్రస్తుల కుటుంబాలకు కందిపప్పు, గోధుమపిండి, గోధుమ నూక, ఆయిల్, సేమియా, సగ్గుబియ్యం, బెల్లం, పంచదార, బియ్యం, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరుగువారిని ప్రేమించాలని క్రీస్తు చెప్పారని, ఆయన ఆశీస్సులు అందరికీ ఉండాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకు అందకపోతే వెంటనే తనను నేరుగా సంప్రదించాలని సూచించారు. పరిశుభ్రత విషయంలో కరుణ సమాజం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కొనియాడారు. తమ పిల్లలకు ఉద్యోగం కల్పించాలని కరుణలోని పలువురు కోరగా.. చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, జిల్లాపౌరసంబంధాల అధికారి బాలమాన్ సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అనురాధ, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు చిన్మయరావు, పి.శ్రీకాంత్, కె.సత్యనారాయణ, శ్రీనివాస చక్రవర్తి, అప్‌హోల్డ్ చైర్మన్ అంజూరు ఫిలిప్ తిమోతి, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సుప్రజ, స్వర్ణకుమారి, సత్యనారాయణ, కరుణ సమాజం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కరుణ సమాజంలో చిన్నారులకు కేక్ తినిపిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

వైభవంగా శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని బలగ నాగావళి తీరంలో ఉన్న బాలా త్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో మార్గశిర పౌర్ణమి సందర్భంగా శ్రీచక్ర రూపేణ సిరిజ్యోతి పూజలు మంగళవారం జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రానికి దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. అలాగే అరసవల్లి పెట్రోలు బంకు వద్ద గల దుర్గా మల్లేశ్వర సన్నిధానం ఆధ్వర్యంలో మంగళవారం కలశ జ్యోతి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వాహకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కలశ జ్యోతులతో, కాజీపేటకు చెందిన పంచిరెడ్డి ఎర్రయ్య బృందం కోలాటం భజనలతో ఊరేగింపు నిర్వహించారు.

జెమ్స్‌లో మెగా కాక్లియర్ ఇంప్లాంట్ స్క్రీనింగ్ క్యాంప్

శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో ఈనెల 29న మెగా కాక్లియర్ ఇంప్లాంట్ స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు జెమ్స్ ఆస్పత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. ఏడాది నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు ఎలాంటి వినికిడి లోపం ఉన్నా వినికిడి యంత్రం ద్వారా బాగు చేయనున్నట్లు తెలిపారు. ఒకవేళ ఎలాంటి ఆపరేషన్ అవసరం పడినా వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా, ఏడిబ్ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 7680945332, 7989290370 అనే ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

జెడ్పీ మాజీ చైర్మన్ వైవీ సూర్యనారాయణ కన్నుమూత

శ్రీకాకుళం రూరల్: జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ వైవీ సూర్యనారాయణ (65) సోమవారం అర్ధరాత్రి కన్నుమూశారు. ఆయన గత ఆరు నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నారు. కిడ్నీ మార్పిడి జరిగాక కొన్ని రోజులు కోలుకున్నారు. ఇటీవలే మరోసారి ఇన్‌ఫెక్షన్ కావడంతో అనారోగ్యం కారణంగా కొన్ని రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. కుటుంబ సభ్యులు విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా.. అప్పటికే ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు ఇద్దరు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు దేవీ వెంకట సత్యనారాయణ అమెరికాలో ఉన్నారు. చిన్నకుమారుడు శ్రీధర్ పెదపాడులోని రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్‌ను నడుపుతున్నారు. ప్రస్తుతం వైవీ సూర్యనారాయణ కోడలు దివ్య శ్రీకాకుళం రూరల్ మండలం జెడ్పీటీసీగా ఉన్నారు.

సూర్యనారాయణ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీల కార్యకర్తగా ఉన్నారు. 1995 నుంచి 2000 వరకూ కిల్లిపాలెం గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. 2001 నుంచి 2006 వరకూ జెడ్పీటీసీగా ఎన్నికై మొదటి పర్యాయంలోనే జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. తరువాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. సూర్యనారాయణ మృతి పార్టీకి తీరని లోటని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నస్థాయి నుంచి ఎదిగారని, నిబద్ధత ఉన్న నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. వైవీ సూర్యనారాయణ మృతదేహానికి బుధవారం ఉదయం స్వగ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన చిన్న కుమారుడు శ్రీధర్ తెలిపారు.

పలువురు పరామర్శ

సూర్యనారాయణ పార్థివ దేహాన్ని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, టీడీపీ నాయకులు కలమట వెంకటరమణ, గొండు శంకర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబటి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు రఘురామ్, గొండు కృష్ణమూర్తి, చిట్టి జనార్దన రావు, మూకళ్ల తాతబాబు, పీఏసీఎస్ నాయకులు గొండు కృష్ణ, గొలివి వెంకటరమణ తదితరులు సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.



వైవీ సూర్యనారాయణ (ఫైల్)



వైవీ సూర్యనారాయణ పార్థివ దేహం వద్ద ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు నివాళి